# ఆశ

**సి. ఆనందారామం**

కోర్టు హాలంతా జనంతో కిక్కిరిసి వుంది. ఎన్నడూ ఎవరూ కనీవినని కేసు. ఒక అబ్బాయిపైన మాతృత్వ పితృత్వ అధికారాల కోసం లాయరు ప్రాక్టీస్ చేస్తోన్న అమ్మాయి డాక్టర్ వృత్తిలో వున్న ఒక నడివయసు ఆయన కోర్టు కెక్కారు. అయితే ఇది మామూలు అన్నీ కేసుల్లా తల్లి తండ్రి బిడ్డపై హక్కు కోసం కోర్టు కెక్కడం లాంటిది కాదు.

ఈ కేసులో నడివయసు ఆయన బాబుకి తండ్రే గాని, అమ్మాయి తల్లికాదు. కాని ఆ అమ్మాయి మాత్రం నడివయసు డాక్టరు బిడ్డకు తండ్రి అవునో కాదో దేవుడికి తెలియాలి కాని తల్లిని మాత్రం ఖచ్చితంగా తానేనని ఘంటా పథంగా చెబుతోంది. ఈ విచిత్ర పరిస్థితి ఎలా ఏర్పడిందంటే!

* * *

"గుడ్ ఈవినింగ్, ఢాక్టర్!"

"గుడ్ ఈవినింగ్, రోజీ"

"హౌ ఆర్ యూ?"

"ఏదో మీ దయవల్ల ఇలా వున్నాను."

"ఇంతకు తమకు నైట్ డ్యూటీ వుందా ఈ వేళ?"

"ఉంది, అంతేగాదు మా శ్రీమతి డెలివరీ కోసం ఇదే హాస్పిటల్‌లో జాయినయింది. అంచేత నాకు డబల్ నైట్ డ్యూటీ."

అతడు డాక్టర్ జయకర్

గౌతమి నర్సింగ్ హోంలో ఛైల్డ్ స్పెషలిస్ట్.రోజీ అక్కడి నర్సు.

జయకర్, రోజీల మధ్య వ్యంగ్య సంభాషణలు మాసే వారికిఅలవాటయిపోయి ఎవ్వరూ పెద్దగా పట్టించుకోరు. జయకర్ మనస్సులో ఏమూలో సన్నని ఆశ. రోజిని పెళ్ళి చేసుకోవాలని — అతనికి భార్య వుంది —.

ఒక వేళ ఆ భార్య ఏమయిన అయిపోతే ...

"ఛీ, ఛీ పాడు ఆలోచన ......" అంటూ ఆ ఆలోచనలు అణచి వేసినా అది తీయగా మెత్తగా మనస్సు పొరల అడుగులలో కమ్మని ఊహా చిత్రాలును సృష్టిస్తోనే వుంది.

"డాక్టర్, డాక్టర్!" కంగారుగా అంటోన్న, డాక్టర్ లక్ష్మి సుధని చూసి తన కలలోంచి బయట పడ్డాడు జయకర్.

"ఏమిటి?" అన్నాడు, విసుగ్గా

లక్ష్మి సుధకి గైనాలిజిస్ట్‌గా పెద్ద పేరుంది. అంత పేరు ఎలా వచ్చిందో గాని ఆవిడ డయాగ్నసిస్ ఎప్పుడూ సరిగ్గా వుండదు. నార్మల్ డెలివరీ కాబోయే కేసుకి తొందరపడి 'సిజేరియన్' చేసేస్తుంది. నార్మల్ డెలివరీ అసంభవం అనే కేసులో శీర్షోదయం కోసం తాపీగా ఎదురు చూస్తుంది. ఆవిడ కొచ్చిన అబద్ధపు పేరు ప్రఖ్యాతుల్ని బట్టి డబ్బున్న వాళ్ళంతా పని కట్టుకుని ఈ ప్రైవేట్ నర్సింగ్ హోంలోనే జాయిన్ అవుతారు.

ఎంత ప్రైవేట్ నర్సింగ్ హోం అయిన డెలివరీ రూములోకి గాని, ఆపరేషన్ థియేటర్‌లోకి గాని పేషెంట్స్ బంధువుల్ని రానీయరు.

ఏ కేస్ అయినా శృతిమించి రాగాన పడ్డాకనే లక్ష్మి సుధ జయకర్ దగ్గరకి వస్తుంది. పేషెంట్స్‌ని సేవ్ చేయమని, బయట వున్న పేషెంట్స్ చుట్టాలకి ఒక మేల్ డాక్టర్ తమ పేషెంట్స్‌ని ట్రీట్ చేస్తున్నట్లు అనుమానం కూడా రాదు. పేషెంట్ అపస్మారక స్థితి లోకి వచ్చాక గాని లక్ష్మి సుధ ఎలాగూ తనని కలవదు. కనక పేషెంట్‌కి తెలిసే అవకాశం అసలు లేదు.

ప్రతిసారి లక్ష్మీసుధ పేషెంట్స్‌ని మృత్యువుతో హోరా హోరీని పోట్లాడి వెనక్కు తీసుకు రావడమే అవుతుంది. అందుకు లక్ష్మీసుధ ఎంతో కొంత బహుమానంగా ముట్టజెప్పుతుంది అది వేరే సంగతి.

"కమాన్ డాక్టర్! క్విక్" తొందరపెట్టింది లక్ష్మీసుధ

మరో ఆలోచన లేకుండా ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళి మాస్క్ తగిలించుకొని, గ్లోవ్స్ తొడుక్కొని పేషెంట్ దగ్గరికి వచ్చాడు. ఒక్కసారిగా కళ్ళు చెదరినట్లయింది. మృత్యువుతో పోరాడుతున్న ఆ అపస్మారక దశలో సైతం అపురూపమైన ఆకర్షణతో మెరిసి పోతున్న ఆమె అందానికి ...... చీటికి మాటికీ చలించిపోతున్న తన మనస్సుని గట్టిగా తిట్టుకుని రంగంలోకి దూకాడు. మృత్యువుతో హోరా హోరి పోరాడి పెద్ద ప్రాణాన్ని రక్షించగలిగాడే కాని శిశువుని ప్రాణాలతో బయిటికి తీయలేక పోయాడు.

గ్లోవ్స్ విప్పేసి నుదుటికి పట్టిన చెమటలను తుడుచుకుంటూ లక్ష్మి సుధ కేసి చూసాడు. కంగ్రాట్స్‌కి ఎదురు చూస్తూ.

కాని ఆవిడ ముఖం వడలిపోయి వుంది.

"ఏయ్! లక్ష్మి! అదేమిటి మీ పేషెంట్‌ని బతికించాను. యిక నవ్వి నాకు కంగ్రాట్స్ పారెయ్" ఆ మాటలు విన్ని లక్ష్మీసుధ ముఖంలోకి నవ్వు రాలేదు.

"జయకర్! పేషెంట్ తల్లి ఎంతో ప్రాధేయపడుతూ అడిగింది. ఎలాగైనా బిడ్డను బతికించమని బిడ్డ గర్భంలో పడగానే ఈ అమ్మాయి భర్త యాక్సిడెంట్‌లో పోయాడుట. అప్పటినుంచీ పిచ్చిదానిలా అయిపోయి గర్భంలో వున్న బిడ్డ కోసమే బతుకుతోందిట. ఇప్పుడెలా?"

"బిడ్డ పోయిన సంగతి షాక్‌లా వుండకుండా మొదట బయటవున్న పేషెంట్ బంధువులతో "పసిబిడ్డ ప్రాణాపాయంతో వుంది" అని చెప్పిరా,"

అప్రసన్నమైన ముఖంతో విధిలేనట్లు అక్కడి నుంచి కదిలింది లక్ష్మీసుధ

* * *

మెత్తని కుషన్ సోఫాలో తప్ప కొయ్య కుర్చీలోనైన ఏనాడు కూర్చోని 'తులసి' హాస్పిటల్ కారిడర్‌లో క్రర బెంచి మీద కూర్చొని తనకు తెలిసిన ఆ సమయానికి తోచిన దేవుళ్ళందరికీ దణ్ణాలు పెట్టేసుకొంటోంది. తన కూతురిని ఎలాగైనా బతికించమని, తనకి మనవణ్ణో, మనమరాలినో తొందరగా చేతిలో పెట్టమని

ఆ రోజు.........

టెలిగ్రాం చేతిలో పట్టుకుని పిచ్చిదానిలా నిలబడిపోయిన ఆశని చూడగానే గుండె గుభిల్లుమంది తులసికి, లాయరు చదువుతోన్న కూతురు ప్రతి చిన్న


విషయానికి అలా అయిపోదు. తూగుటుయ్యాల మించి లేచి కుంటు కుంటూ నడిచి,

"ఏం తల్లీ? ఏం జరిగింది.?" అని అడిగింది.

సమాధానం రాలేదు. పరిగదా నిల్చున్న చోటునే కుప్పకూలి పోయింది ఆశ. నౌకరులను పిలిచి కూతుర్ని లోపలి పడక గదిలో పడుకోబెట్టించింది. ఎవరితోనో. టెలిగ్రాం చదివించుకుంది.

దాని అర్థం బోధపడే సరికి వడుం విరిగినట్లయింది. అల్లుడు గారు యాక్సిడెంట్‌లో పోయారుట. ఏరికోరి ప్రేమించి చేసుకున్న పెళ్ళి. మోటార్ సైకిల్ స్పీడుగా నడుపుతూ రోడ్డు మలుపు తిరుగుతుండగా అటువైపు నుంచి లారీ వచ్చి కొట్టేసిందిట!

మరొక్క నెలలో భర్త రాక కోసం ఎదురు చూస్తున్న కూతురికి ఈ టెలిగ్రాం.




ఆ షాక్ నుంచి ఆశ తేరుకోడానికి నాలుగైదు నెలలు పట్టింది. ఆశ మంచంలో ఉండగానే డాక్టర్ చెప్పింది. కడుపులో పెరుగుతోన్న బిడ్డ సంగతి. బహుశ ఈ ఒక్క విషయమే ఆశకు తిరగి బతకడానికి శక్తినిచ్చి వుంటుంది. కోలుకున్న దగ్గరి నుంచీ మూడీగా, ముభావంగా తయారయి పోయింది ఆశ. ఎలాగో ఒక లాగ కూతురు కళ్ళ ముందు తిరుగుతూ వుంటే చాలని సమాధాన పడింది తులసి. ఇంట్లో తల్లి, తండ్రి నౌకర్లు వున్నా, వారెవ్వరూ తనకేమి కానట్లు తన గదిలో కూర్చొని ఇంకా ఆకారమైనా ఏర్పరుచుకోని తన కడుపులో బిడ్డతోనే తన కష్ట సుఖాలన్నీ చెప్పుకునేది. చదువు మానలేదు. కాలేజికి వెళ్ళేది క్లాసు పాఠాలు చదువుకునేది. కాని తీరక సమయాల్లో మాత్రం తన గర్భంలో వున్న శిశువుతో తప్ప, బయటి లోకంతో సంబంధం లేనట్లుగా గడిపేది. అలాంటిది ఇప్పుడు శిశువుకేమైనా జరగరానిది జరిగితే మళ్ళీ తను ఆశని ప్రాణాలతో చూడగలదా?

"ఛ, ఛ పాడు ఆలోచన" టపటప లెంప లేసుకుని వేంకటేశ్వరస్వామికి,

సత్యనారాయణ స్వామికి, షిర్డి సాయిబాబాకి మంత్రాలయం రాఘవేంద్రస్వామికి, మొక్కుకుంటూ దణ్ణాలు పెట్టుకుంది.

సరిగ్గా ఆ సమయానికి వచ్చింది లక్ష్మీ సుధ. చవట నవ్వు నవ్వుతూ "పెద్ద ప్రాణాన్ని కాపాడాం" అంది ఏదో పెద్ద ఘనకార్యం సాధించినట్లు.

"మరి బిడ్డ సంగతి?"

"చెప్పలేం......"

కెవ్వున కేకపెట్టింది తులసి.

చుట్టు ప్రక్కల రూముల్లో వున్న ఆయాలు, నర్సులు గభాలున బయటికి వచ్చారు. విషయం గ్రహించారు. కొందరు విసుక్కుంటూ, మరి కొందరు నవ్వుకుంటూ, ఎవరి దారిన వారు వెళ్ళి పోయారు.

రోగుల బంధువుల ఆర్తనాదాలు వాళ్ళ మనసులని ఏ విధంగాను కదలించవు చుట్టువున్న రణగొణ ధ్వనిలో అదీ ఒక భాగమే అయిపోయింది వాళ్ళకి.

"ష్! ఊరుకోండి!" గదమాయిస్తున్నట్లు ఊరడించింది డాక్టర్.

"డాక్టర్! బిడ్డ దక్కకపోతే పెద్ద ప్రాణాన్ని మీరు కాపాడీ ప్రయోజనం లేదు. తన బిడ్డ లేదని తెలిసాక అది బ్రతకదు. శిశువుని ఎలాగైనా బ్రతికించండి డాక్టర్"

"మేము మానవ మాత్రులం, ప్రయత్నం చేయగలం అంతే గాని ప్రాణం పోయలేము."

"డాక్టర్ మీరు శిశువుని బతికిస్తే పదివేల రూపాయిలు ఇచ్చుకుంటాను."

"పది వేలు, పది వేలు......"

లిప్త మాత్రం లక్ష్మీ సుధ మనస్సు స్తంభించి తిరిగి మరింత చురుకుగా పని చేయసాగింది.

డాక్టర్ ముఖంలోకి చూస్తూ మరింత ఆశగా,

"డాక్టర్ పదివేలు ... నిజంగా ఇప్పుడే ఇస్తాను చెక్"

చెక్ బుక్ తీసి చెక్ రాసి చేత్తో పట్టుకుంది.

"నా మనవణ్ణి చూపించిన మరుక్షణం ఈ చెక్ మీ చేతుల్లో పెడతాను."

"మనవడు కాదు......"


అనబోయి ఆగింది లక్ష్మీసుధ.

మనవడయితేనేం? మనమరాలయితేనేం జీవంతో లేనప్పుడు... ఆలోచిస్తూ ఆపరేషన్ థియేటర్‌లోకి వచ్చింది. నంటిమీద తెలివి లేకుండా పడివున్న ఆశ!

నిర్జీవంగా వున్న శిశువు.

డాక్టర్ జయకర్ లేడక్కడ! అతడి కోసం విచారిస్తే లేబర్ రూంలో తన భార్య బెడ్ ప్రక్కన వున్నాడని తెలిసి అక్కడికెళ్లింది.

అక్కడ......




జయకర్ భార్య కళ్ళు భర్తని నిలదీసి ప్రశ్నిస్తున్నట్లుగా వున్నాయి.

కాని ...... అవి నిర్జీవంగా వున్నాయి. ప్రక్కనే పసిబాబు కేర్ కేర్‌మని గోల గోలగా ఏడుస్తున్నాడు.

డాక్టర్ జయకర్ మనస్సులో రోజీ మెదిలింది.

కళ్ళ ఎదుట భార్య నిర్జీవమైన కళ్ళు లక్ష ప్రశ్నలతో అతడ్ని వేధిస్తున్నాయి. ఈ భార్య అతనికి రెండో భార్య. మొదటి భార్యకు పిల్లలు లేకపోతే ఈవిడని చేసుకున్నాడు. తీరా ఈవిడ కడుపుతో వున్నాక ఈ శిశువు తన శిశువు కాదేమోనని అనుక్షణం అనుమానమే!

ఆ అనుమానంతో నరకం అనుభవించి భార్యకు కూడా అది రుచి చూపించాడు.

ప్రాణాలతో వుండగా భర్తని ఏమి అనలేని ఆ నిర్భాగ్యురాలు ప్రాణాలు పోయాక తెరచిన కళ్ళతో అతడ్ని శపిస్తోంది.

కేర్‌మని ఏడుస్తోన్న బిడ్డకేసి చూసాడు. ఈ శిశువు తన శిశువేనా?"

మళ్ళీ అనుమానం మనస్సులో.

లక్ష్మీసుధ డా.జయకర్ చెయ్యి పట్టుకుని "ఇలా రండి" అని ఆపరేషన్ థియేటర్‌లోకి లాక్కొచ్చింది. పదివేల సంగతి డాక్టర్‌తో చెప్పి "ఎవరైనా ఒక శిశువుని ఈ తల్లి దగ్గర చేర్చగలిగితే మనకి పదివేలు వస్తాయి" అంది.

"మనిద్దరినీ జైల్లో పెడతారు."

"పదివేలు వదలుకోవలసిందేనా?"

జయకర్ వెంటనే సమాధానం చెప్పలేదు. అతని మనసు తెర ముందు కేర్ కేర్ మంటున్న శిశువు... తనది కాదేమోనన్న అనుమానం... చచ్చిపోయిన భార్య... యవ్వనంలో మిలమిల మెరిసే రోజీ... ఒకరి తర్వాత ఒకరుగా కదులుతున్నారు.

"డాక్టర్! ఒక ఆలోచన! నా బాబుని ఇచ్చేయమంటారా ఈ తల్లికి?" అన్నాడు.

"ఆ ..." ఆశ్చర్యంగా నోరు తెరచింది లక్ష్మీసుధ.

"థాంక్స్!డాక్టర్"

"కానీ రెండు షరతులు"

"చెప్పండి"

"నా బాబుని మీరు తీసుకుంటున్నట్లుగా కాగితం మీద వ్రాసి సంతకం పెట్టినాకు ఇవ్వాలి. మీ పదివేలలో నాకు ఐదు వేలు ఇవ్వాలి" క్షణం ఆలోచించి, ఒప్పుకుంది లక్ష్మీసుధ.

ఐదు వేలు వచ్చినా వచ్చినట్లే...

బిడ్డను తను తీసుకుంటున్నట్లుగా వ్రాసినంత మాత్రాన, నష్టమేమి లేదు. జయకర్ సంగతి లక్ష్మీసుధకి బాగా తెలుసు.

తల్లి లేని పసివాడి బాధ్యత తీసుకోడానికి అతడెన్నటికీ ముందుకు రాడు. మరో పది నిమిషాలలో కేర్ కేర్ మంటున్న పసివాడ్ని తులసి చేతుల్లో పెట్టింది లక్ష్మీసుధ.

మనవడ్ని ప్రేమతో హృదయానికి హత్తుకుంది అమ్మమ్మ.

* * *

లాయరుగా ప్రాక్టీస్ ప్రారంభించింది ఆశ. పసివాడికి ఐదు నెలలే అయినా ఏ రోజుకారోజు తన కోర్టు విశేషాలన్నీ వాడికి చెబుతుంది. వాడు ఊ, ఆ ... ఉంగాలతో రెస్పాన్స్ ఇస్తోంటే తనమాటలు అర్థం చేసుకుని సలహాలిస్తున్నట్లే భావించి ఆనందించేది.

ఆ రోజు చాలా బడలికగా ఎంతో పోగొట్టుకున్నట్లుగా ఇంటికి వచ్చింది. ఎప్పటిలాగే కొడుకుని ఒళ్ళో కూర్చోపెట్టుకుని తన ఆవేదనని ఇలా చెప్పుకుంది..

"చూడరా, బుజ్జీ! ఎంత దురన్యాయమో! చూడు! మగవారు పశువుగా ఆడదాన్ని అతి దారుణంగా హింసించాడు. పాపం ఆడది భరించలేక వాడి నుంచి విడిపోవడానికి ప్రయత్నించింది. న్యాయం కోసం కోర్టు కొస్తే తన బిడ్డని తనకిచ్చెయ్యమన్నాడు మొగవాడు.

"పోషించగలిగే స్తోమత స్త్రీకి లేదు కనుక బిడ్డ మీద హక్కు మగవాడిదేనట!

పాపం తన బిడ్డని వదులుకోలేక ఆ స్త్రీ గోడుగోడున ఏడుస్తూ ఆ మగవాడి వెంట బానిసలా వెళ్ళిపోయింది.

ఆ మొగవాడు మొగుడులే!

ఎంత దురన్యాయమో చూసావురా, బుజ్జీ?"

"స్త్రీకి మాతృత్వం అనే మహత్తర వరమిచ్చాడు దేవుడు. కాని చివరకు తన బిడ్డ కోసం కూడా మగవాడి మీద ఆధార పడే దౌర్భాగ్యపు వ్రాత రాసాడు" అంటాడు చలం.

ఎంత నిజం! ఈ మాటలు! ఇక ముందైన ఇలాంటి దౌర్భగ్యపు అవస్థ ఆడదానికి ఉండకూడదోయ్! బుజ్జీ!"

అదే నా ఆశ ఫలిస్తుందంటావా?"

పసివాడు బోసి నోరు అంతా తెరచి వెన్నెల్లా నవ్వాడు......

* * *

రోజి జయకర్‌ని తప్పించుకుని తిరగడం మొదలు పెట్టింది. అతని కర్థం అయిపోయింది. రోజి కేవలం ప్రమోషన్ కోసం తన చుట్టూ తిరిగిందే తప్ప తన మీద ఏ విధమైన వ్యామోహమూ లేదు.

ఒకనాడు అతడు కార్లో కోర్టు కెళుతున్న ఆశని చూసాడు. వెంటనే అతనికి తన బిడ్డ కాదేమోనని అనుకున్నా, తన బిడ్డ గుర్తొచ్చాడు. అతడి కన్ను ఆశ మీద పడింది. బిడ్డతో చనువు పెంచుకుంటే కథల్లోలాగా, నవల్లోలాగా, ఆశ తనని పెళ్లి చేసుకోవచ్చు. బోలెడంత ప్రాక్టీస్, డబ్బు ఆకర్షణీయమైన అందం, పైగా తన బిడ్డ! ఆ క్షణం నుంచీ డా.జయకర్ ఆ బిడ్డ తన బిడ్డ కాదేమోనని అనుకోడం మానేశాడు. పని కట్టుకుని ఆశ ఇంటికి వెళ్ళి పరిచయాలు పెంచుకున్నాడు. బాబుకి బిస్కెట్లు చాక్లెట్లు వగైరా యిచ్చి చనువు చేసుకోగలిగాడు.

ఆశకి జయకర్ మీద ప్రత్యేకమైన గౌరవం ఏమీ లేదు. తన ప్రాణాలు కాపాడినది డా.జయకర్ అని కూడా తెలియదు. ఆమె దృష్టిలో తన బిడ్డను కాపాడినది లక్ష్మిసుధ. కాని పని గట్టుకుని ఇంటికి వచ్చి తన కొడుకుతో ఆడుకుంటున్న డాక్టర్‌ని విదిలించి బయటకు పంపెయ్యలేక పోయింది.......

కాలం ఎటువంటి గాయాలైనా మాన్పుతుంది. ఆశ తన కొడుక్కి "అపూర్వ" అని పేరు పెట్టుకుంది. వాడికి ఐదేళ్ళు వచ్చాయి. ఆశకి తన కొలీగ్ లాయర్ భరత్‌తో పరిచయం పెరిగి ప్రేమలోకి మారింది. అనేక సంకల్ప, వికల్పాల తరువాత తల్లి ప్రోత్సాహంతో 'భరత్'ని పెళ్ళి చేసుకోడానికి నిశ్చయించుకుంది.

ఈ పెళ్ళి కారణంగా "అపూర్వ" భవిష్యత్ ఏ రకంగానూ దెబ్బ తినకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంది. ఆశని మళ్లీ పెళ్ళి చేసుకోమని ప్రోత్సహించింది తులసి. "అపూర్వ"ని తన కంఠంలో ప్రాణం వున్నంతవరకు జాగ్రత్తగా చూస్తానంది.

ఈ పరిణామాలకు నివ్వెరపోయాడు డా.జయకర్. అతడి ఆశలు కుప్పకూలి పోయాయి. చివరకి కొడుకు కోసమైన ఆశ తనకు లొంగుతుందేమోనని కోర్టుకెక్కాడు......

* * *

"ఆ రోజు ఆశ ప్రాణాపాయ దశలో వుంది. ఇటు నా భార్య చచ్చిపోయింది. డా.లక్ష్మిసుధ ఈ పేషెంట్ ప్రాణాలని కాపాడమని ప్రాధేయపడింది. ఒక డాక్టరుగా రోగి ప్రాణాన్ని కాపాడాలని నా కొడుకుని త్యాగం చేసాను.

సాక్ష్యం కావాలంటే ఇదిగో డా.లక్ష్మిసుధ వ్రాసిన ఉత్తరం. ఇప్పుడు ఆశ కోలుకుంది. కాబట్టి మరొకరిని పెళ్ళి చేసుకోబోతోంది. కాబట్టి నా కొడుకుని నాకు ఇచ్చి వెయ్యవలసిందిగా కోర్టు వారిని ప్రార్థిస్తున్నాను.

ఇది డా.జయకర్ వాదన.

"ఈ సంగతులన్నీ నాకు తెలియవు, నాకు తెలిసినంత వరకు "అపూర్వ" నా కొడుకు. అంతే! నాకు తెలియకుండా మరొకరి బిడ్డని నా బిడ్డగా చలామణీ చేసే అధికారం డాక్టర్‌కి ఎవరిచ్చారు.? ఇచ్చాక బిడ్డని తిరిగి తీసుకునే హక్కు ఎలా వస్తుంది? నా "అపూర్వ"ని నా నుంచి వేరు చేసే అధికారం ఎవ్వరికీ లేదు."

ఇది ఆశ ప్రతివాదన.




అటు పత్రికల వాళ్ళని, ఇటు సమాజాన్ని విశేషంగా ఆకర్షిస్తూ కోర్టులో కొంత కాలం వాదోపవాదాలు సాగాయి. లక్ష్మిసుధ డా.జయకర్ కేవలం రోగి ప్రాణాన్ని కాపాడడానికే ఆ పని చేసామన్నారు. తాను చేసినది మహత్తర త్యాగంగా చెప్పుకుంటున్నాడు డా.జయకర్. ఆశని కోర్టు ప్రశ్నించింది.

"నువ్వు మరొకరిని పెళ్ళి చేసుకుంటున్నావు కదా! నీకు వేరే పిల్లలు పుడతారు. జయకర్ కొడుకుని అతనికిచ్చేయ కూడదా?"

"తరువాత ఎవరైనా పుట్టినా, పుట్టకపోయినా, "అపూర్వ" నా కొడుకు నేను వదులుకోను. నేను మళ్ళీ పెళ్ళి చేసుకోవటమే వాడికి తల్లి కాకుండా చేయడానికి అభ్యంతరమయితే పెళ్ళి మానేస్తాను."

"అయితే నీ కోరికలు అన్నీ చంపుకుని యోగినిలా జీవిస్తానంటావా?"

"పెళ్ళి మానేస్తానన్నాను కాని కోరికలు చంపుకుంటానననలేదు? అతడిని పెళ్ళి చేసుకోను అంతే, ఇద్దరం కలిసే వుంటాం.

ఒక స్త్రీ, కోర్టులో నిలబడి చెప్పిన సమాధానానికి లోకమే నివ్వెరపోయింది. ఎవరికీ, ఏమనడానికి నోరు రాలేదు. ఆ క్షణంలో ఆశ మొహం చూసేవారికి ఆమె నుద్దేశించి తేలికగా మాట్లాడే సాహసం కలగలేదు.

డా.జయకర్ తన శిశువుని త్యాగం చేయవలసిందిగా ఆశాదేవి కోరలేదు. ఏ కారణం వల్లనైతే నేమి, అతడు ఇచ్చాడు. అందువల్ల ఇప్పుడు శిశువుపై అధికారం ఆశాదేవిదే!" అని కోర్టు తీర్పు ఇచ్చింది.

* * *

ఐదేళ్ళ "అపూర్వ"ని దగ్గరిగా తీసుకుని ఆశ అంది.

"ఒరే బుజ్జీ! మీ అమ్మ ఆశ ఫలించిందోయ్!" ఆడది తన సంతానం కోసం మగవాడి మీద ఆధార పడక్కర్లేదు. ఆ జయకర్‌గాడి సంగతంతా తెలిసింది. వాడి ఇదివరకటి ఇద్దరు భార్యలు ఎలా చచ్చిపోయారో కూడా తెలిసింది.

ఆ రాస్కెల్‌ని ఇక ముందు మన గడప తొక్కనియ్యద్దు. ఏమంటావ్ అపూర్వ?"

తన లేత బొటన వ్రేలు పైకి సాచి 'ఒ.కె.మామ్!" అన్నాడు ఐదేళ్ళ పసివాడు.